క్లుప్తంగా

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

వంగర: సంగాంలో వెలిసిన సంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్సై షేక్ శంకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాహనాల పార్కింగ్ స్థలాలు, క్యూలైన్‌లో బారికేడ్ల ఏర్పాటు, త్రివేణి సంగమం వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పరిశీలనలో మాజీ సర్పంచ్ బొడ్రోతు శ్రీనివాసరావు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ బోను ఆనందరావు, తదితరులున్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

సంతకవిటి: మండల కేంద్రంలో ఎస్సై ఆర్.గోపాలరావు తన సిబ్బందితో కలసి ఆదివారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ధ్రువపత్రాలు లేని వారికి, నిబంధనలు ఉల్లంఘించిన వారికి అపరాధ రుసుం విధించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

వితరణ



బారికేడ్లు, సోఫాలతో పోలీస్ సిబ్బంది

బొబ్బిలి: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు రహదారుల కూడళ్ల వద్ద ఏర్పాటు చేసేందుకు ఐదు బారికేడ్లు, నాలుగు స్టీల్ సోఫాలను క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ ప్రతినిధులు బొబ్బిలి ఎస్సై జ్ఞానప్రసాద్‌కు ఆదివారం అందజేశారు. కంపెనీ విశాఖ డివిజనల్ మేనేజర్ వెంకటరమణ, లైజనింగ్ ఆఫీసర్ రమేష్‌బాబు, ఏరియా మేనేజర్ చక్రధరరావు, బ్రాంచ్ మేనేజర్ తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దాసాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ



బొబ్బిలి: పట్టణంలోని పాత బస్టాండ్‌వద్ద గల దాసాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాలను తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన ఆగమ పండితులు నిర్వహించారు. పట్టణానికి చెందిన పవిత్ర డ్యాన్స్ అకాడమీ విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న సైన్స్ ఉపాధ్యాయురాలు ఉమామహేశ్వరి

రేగిడి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 యూనిట్ల రక్తం సేకరించి రెడ్‌క్రాస్ సంస్థకు అందజేసినట్లు సైన్స్ ఉపాధ్యాయురాలు, రెడ్‌క్రాస్ నోడల్ అధికారి బూరవిల్లి ఉమామహేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాతలను హెచ్‌ఎం లక్ష్మణరావు, జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధులు పెంకి చైతన్యకుమార్ అభినందిస్తూ, ప్రశంసాపత్రాలు అందజేశారు. సర్పంచ్ కిమిడి రవిశంకర్, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గడ్డి వాము దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

వంగర: మండల పరిధి తలగాంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన వావిలపల్లి సుగుణమ్మకు చెందిన ఆరు ఎకరాల వరగడ్డి దగ్ధమైంది. ఎవరో సిగరెట్ కాల్చి పడేయడం వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.30 వేల నష్టం జరిగి ఉంటుందని అంచనా. రాజాం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

వేర్వేరుగా తడి, పొడి చెత్త

రాజాం సిటీ: గ్రామాల్లోని ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి పెనుబాక గ్రామంలో జరుగుతున్న చెత్తసేకరణ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వినియోగించి హోమ్ కంపోస్టు ఎరువు తయారుచేయవచ్చునని సూచించారు.

శివరాత్రి ఉత్సవాలకు సిద్ధం..

- పార్వతీ మల్లికార్జునస్వామి ఆలయానికి ప్రత్యేక అలంకరణలు
- భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు

బాడంగి: మండలంలోని పాల్తేరు గ్రామశివారులో వేగావతి నది ఒడ్డున గల పార్వతీమల్లికార్జున ఆలయాన్ని శివరాత్రి ఉత్సవాలకు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ పార్వతీమల్లికార్జున స్వామిని దర్శించుకుంటే శ్రీశైల పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్న ఫలితం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. స్వామిని దర్శించుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రతిరోజూ ఆలయానికి భక్తుల తాకిడి ఉంటున్నప్పటికీ, విశేషమైన శివరాత్రి, కార్తీకమాసం, పౌర్ణమి వంటి పుణ్యదినాల్లో సమీప ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు స్వామి దర్శనానికి వస్తుంటారు. కార్తీకమాసంలో కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం, గంగాహారతి వంటి కార్యక్రమాలు చేపడుతుంటారు. ఆయా కార్యక్రమాల్లో పాలుపంచుకునేందుకు వేలాది మంది భక్తులు వస్తుంటారని అర్చకులు చెబుతున్నారు. ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయాన్ని అందగా ముస్తాబు చేస్తున్నారు.

ఆకట్టుకునే విగ్రహాలు..

ఆలయం లోపల మల్లికార్జునస్వామి లింగం చుట్టూ గోడలకు గణపతి, ఆదిశంకరాచార్యులు, వల్లీదేవసేనా సుబ్రహ్మణ్యస్వామి, పార్వతి అమ్మవార్ల విగ్రహాలు దర్శనమిస్తాయి. అదేవిధంగా ఆలయ పరిసరాల్లో అష్టలక్ష్మీ, లక్ష్మీనారాయణ విగ్రహాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. విశాఖలోని కైలాసగిరిలో మాదిరిగా పెద్ద మట్టిగుట్టపై ఉన్న పార్వతీ మల్లికార్జున విగ్రహాలను చూసి భక్తులు పరవశించిపోతారు. అలాగే ఆలయం చుట్టూ ధన్వంతరీ మంత్రం పేరుతో దేవతా వృక్షాలు, ఆవులతో కూడిన పశుపతి నిలయం, యజ్ఞశాలలు, ధ్వజస్తంభం, నందీశ్వరుడు దర్శనమిస్తారు. వేగావతి నది ఒడ్డున సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్న ఆలయం ప్రశాంతతకు మారుపేరుగా నిలుస్తోంది. శివరాత్రి వంటి పర్వదినాల్లో అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అర్చకులు, కమిటీ సభ్యులు తెలిపారు.



పాల్తేరు పార్వతీమల్లికార్జున స్వామి ఆలయం (ఇన్‌సెట్లో) ఆలయంలో వెలిసిన మల్లికార్జునస్వామి శివలింగం



ఆలయ ప్రాంగణంలో పశుపతి నిలయం



కైలాసగిరిని తలపించేలా గుట్టపైన పార్వతీ మల్లికార్జునుల విగ్రహాలు

ఇలా చేరుకోవచ్చు..

ఈ ఆలయానికి చేరుకోవడానికి బొబ్బిలి నుంచి రంగరాయపురం మీదుగా.. బాడంగి నుంచి మల్లంపేట మీదుగా.. తెర్లాం, రాజాం నుంచి ఆకులకట్ట, బొత్సవానివలస జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించవచ్చు. ఆయా రూట్లలో ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులతో పాటు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ఆలయానికి చేరుకోవచ్చు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: వైఎస్సార్‌సీపీ పటిష్టానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన చినశిర్లాం గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు ఎమ్మెల్సీని ఆదివారం అతని స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. జిల్లా కమిటీలో రేగిడి మండలానికి సముచిత స్థానం ఇవ్వడంపై ఆనందం వ్యక్తం చేశారు. అచ్చెన్నాయుడుతో పాటు రాజాం నియోజకవర్గం నుంచి పదవులు దక్కించుకున్న ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి సహకరించాలన్నారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు తనకు గుర్తింపు నిచ్చిన పార్టీకి, ఎమ్మెల్సీ విక్రాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, సర్పంచ్ కెల్ల మన్మధరావు, మొయిద శ్రీనివాసరావు, అంతకాపల్లి సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ విక్రాంత్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అచ్చెన్నాయుడు

పుస్తక పఠనంతో మేలు..



విద్యార్థులు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. – తెర్లాం

క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు..



క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని ఎంఈఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు, కనగల పారినాయుడు, నేతాజీ, చక్రపాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు. – వంగర

అన్న సంతర్పణ..



రాజాం పట్టణంలోని గాయత్రీకాలనీలో గాయత్రీదేవి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. సుమారు ఐదు వేలకు పైగా భక్తులు హాజరై ప్రసాదం స్వీకరించారని ఆలయ ధర్మకర్తలు కొండవీటి తేజోమూర్తి, కొండవీటి వివేకానందరావు వెల్లడించారు. గాయత్రీకాలనీ, రాజాం, పెనుబాక, బొద్దాం, తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరం..



యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై నీలావతి సూచించారు. మండలంలోని దేవుదళ గ్రామంలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కలిగి ఉండాలని.. ఫోన్‌ల ద్వారా వచ్చిన తప్పుడు మెసేజ్‌కు స్పందించవద్దని సూచించారు. యువత మద్యం బారిన పడవద్దని, గంజాయి, గుట్కాలు వంటివి సేవించవద్దని హితవుపలికారు. – రేగిడి

విశ్వసాహిత్య వేదికపై 'అమ్మ నవల'

రాజాం సిటీ: రష్యన్ రచయిత మాగ్జిం గోర్కీ రచించిన 'అమ్మ నవల' విశ్వసాహిత్య వేదికపై వెలుగొందుతున్న గొప్ప గ్రంథమని సమతం మహేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 121వ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'మాగ్జిం గోర్కీ – అమ్మ నవల – ప్రాసంగికత' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ.. రష్యా విప్లవ నేపథ్యంలో వచ్చిన ఈ నవల ప్రపంచంలోనే కార్మికవర్గాన్ని ఐక్యపరచిందన్నారు. ప్రపంచ కార్మికులంతా ఒకే వర్గమని రచయిత నిరూపించారని కొనియాడారు. కార్మికవర్గ తిరుగుబాటే రష్యా విప్లవానికి కారణమైందని తెలిపారు. కుమారుడిని విప్లవ యోధునిగా తీర్చిదిద్దడంలో, సహకరించడంలో అమ్మపాత్ర ఎంత గొప్పదో గోర్కీ వివరించారన్నారు. అనంతరం వేదిక సభ్యులు మహేశ్వరరావును సత్కరించారు. రౌతు గణపతిరావునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వేదిక సభ్యులు గార రంగనాథం, రౌతు నిర్మల, ఒమ్మి రమణమూర్తి, పిల్లా తిరుపతిరావు, ఆల్తి మోహనరావు, పొదిలాపు శ్రీనివాసరావు, శాసపు సత్యనారాయణ, మూడడ్ల శ్రీనివాసరావు, పెంకి దయానిధినాయుడు, పడాల కవీశ్వరరావు, ఉరిటి రామలింగేశ్వరరావు, రాజాపు శాంతారావు, వల్లూరి రామినాయుడు, పెంకి చైతన్యకుమార్, అమనాన నాగేశ్వరరావు, అంబళ్ల రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమతం మహేశ్వరరావు

సేవాభావం గొప్పది

- ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: నిరుపేదల పట్ల చూపిస్తున్న సేవాభావం ఎంతో గొప్పదని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. మండల పరిధి కొట్టిశ గ్రామానికి చెందిన బోనెల తాతబాబు, కళావతి దంపతులు సమకూర్చిన దుస్తులను 30 మంది పేదలు, వితంతువులకు ఆదివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. నిరుపేదల పట్ల సేవాభావం కలిగి ఉండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బొత్స ప్రవీణ్, యలకల వాసునాయుడు, గురాన అన్నపూర్ణమ్మ, బెవర భాస్కరరావు, ఉత్తరావెల్లి చిన్నంనాయుడు ఉన్నారు.

అందని ద్రాక్షగా సంక్షేమ పథకాలు..

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి : కూటమి ప్రభుత్వ హయాంలో సూపర్‌సిక్స్ పథకాలు అందని ద్రాక్షేనని ఎమ్మెల్సీ విక్రాంత్ ఆరోపించారు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు బూటకమేనని మండిపడ్డారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తల్లికి వందనం రాలేదు గాని, తండ్రికి ఇంధనం (మద్యం) ధరలు పెంచి విచ్చలవిడిగా గ్రామాల్లో బెల్ట్‌షాపులు ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. ఆడపిల్లకు ప్రతినెలా రూ.1500 ఇస్తామన్న చంద్రబాబు హామీ అడ్రస్ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. రూ.20 వేల అన్నదాత సుఖీభవ ఆశలు గాలిలో కలసిపోయాయని, రైతులను నిలువెత్తునా మోసం చేశారని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి జాడే లేదన్నారు. అన్ని వర్గాలనూ సామాజికంగా, ఆర్థికంగా నష్టపరిచారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతుందే తప్ప సామాన్యులను ఆదుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

నిత్యావసర సరుకుల అందజేత

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన రెండు పేద కుటుంబాలకు స్థానిక యువత ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. వడ్డి హైమ, కేశారపు తవుడమ్మలకు నెలకు సరిపడా సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివరామాంజనేయ యువజన సంఘ సభ్యులు రెడ్డి శ్రీనివాసరావు, బెజ్జిపురపు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా సురేష్

రేగిడి: ఏపీఈపీడీసీఎల్ మండల ఏఈగా వావిలపల్లి సురేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రాజాం రూరల్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

వంద రోజుల పనులపై దృష్టి సారించండి

- డ్వామా పీడీ శారదాదేవి

రాజాం సిటీ: ఉపాధిహామీ పనుల కల్పనలో భాగంగా వంద రోజుల పనులపై సిబ్బంది దృష్టి సారించాలని డ్వామా పీడీ ఎస్.శారదాదేవి అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఉపాధి పనుల ప్రగతి అధ్వానంగా ఉందని.. దీనిని మెరుగుపర్చాలని సూచించారు. 60 : 40 నిష్పత్తి ప్రకారం పనులు జరిపించాలన్నారు. మరో 35 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న దృష్ట్యా వంద రోజుల పనిదినాల కల్పనలో ప్రగతి సాధించాలని ఆదేశించారు. పనులు కల్పించడంలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ ఎం.శ్రీనివాసరావు, నాలుగు మండలాల ఏపీఓలు, ఈసీలు, ఎఫ్‌ఏలు, టీఏలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ శారదాదేవి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్యాయం

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

రామభద్రపురం: ఎన్నికల హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్యాయం చేసిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు ఆరోపించారు. పీఆర్‌టీయూ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడుకు మద్దతుగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.బలరాంనాయుడుతో కలిసి ఆదివారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఎఫ్, డీఏ, 11వ పీఆర్సీ, ఏపీజీఎల్ఐ వంటి వాటికి సుమారు రూ.30 వేల కోట్లు వరకు పాత బకాయిలున్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పాత బకాయిలను చెల్లిస్తానని ఎన్నికల ముందు ఇచ్చిన హామీను అమలు చేయాలని కోరారు. శ్రీనివాసులనాయుడుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ పైడిరాజు, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ఆర్. కృష్ణ, మండల అధ్యక్షుడు బి.రవికుమార్ పాల్గొన్నారు.



రామభద్రపురం: మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

సమస్యలు పరిష్కరించడం లేదు..

బొబ్బిలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడం లేదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.హృదయరాజు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య విద్యానికేతన్‌లో ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులంతా ప్రభుత్వానికి వివిధ పద్దుల కింద రూ.300 కోట్లు ఏటా చెల్లిస్తున్నారన్నారు. అయినప్పటికీ ఉపాధ్యాయులకు రావాల్సిన ప్రయోజనాలు వెంటనే మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదవీ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ, ఇతర ప్రయోజనాలను రెండు, మూడేళ్ల పోయాక చెల్లిస్తామని అనడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఎమ్మెల్సీగా గతంలో సేవలందించిన గాదె శ్రీనివాసులనాయుడును గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు జి సత్యనారాయణ, ఏజీఎస్ గణపతి, ఆర్ కృష్ణ, చింత రమణ, వాలేటి తవిటి నాయుడు, సీహెచ్ రామారావు డి వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో ఉండాలి..

- మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: వివిధ సామాజికవర్గాలన్నీ ఐక్యంగా ఉంటూ వసతి సౌకర్యాలను కల్పించుకోవాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని యాదవవీధిలో ఆ సామాజిక వర్గానికి భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక పెద్దలతో కాసేపు ముచ్చటించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణానికి పట్టణంలో స్థలం సమకూర్చడం విశేషం. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గొలగాని రమాదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి భమిడిపాటి విశ్వనాథశర్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

హోం కంపోస్టు ఎరువుతో మెరుగైన ఫలితాలు

రాజాం: పట్టణంలోని ప్రజలు హోం కంపోస్టు ఎరువు తయారీపై దృష్టి సారిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ సూచించారు. పట్టణంలోని ఆదినారాయణకాలనీ, వాసవీనగర్, ఈశ్వరనారాయణకాలనీ ప్రాంతాల్లో ఆదివారం పర్యటించి మహిళలకు అవగాహన కల్పించారు. ఇంటిలో కూరగాయలు, ఆహార పదార్థాల వ్యర్థాలతో డస్ట్‌బిన్ ఉపయోగించి హోం కంపోస్ట్ ఎరువు ఎలా తయారు చేయాలో వివరించారు. ఈ ఎరువుతో ఇంటి పెరడులో కూరగాయలు, పూల మొక్కలు సాగు చేయవచ్చని చెప్పారు.



హోం కంపోస్టు ఎరువు తయారీని పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

కొత్త విషయాలు నేర్చుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు శివకృష్ణ

రాజాం: మన చుట్టుపక్కల ఉన్న ప్రతీ వ్యక్తి, వస్తువు నుంచి ఎన్నో మంచి విషయాలు, కొత్త అంశాలు నేర్చుకోవచ్చునని పొగిరి గ్రామానికి చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు బూరాడ శివకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ వీధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద చిన్నారులకు వ్యక్తిత్వ వికాస తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ క్షణం కొత్త విషయాన్ని నేర్చుకునేందుకు విద్యార్థి దశ నుంచే అన్వేషణ జరగాలన్నారు.